# పసిడి, చమురు పైపైకే..

## వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఔన్స్ బంగారం 3,150 డాలర్లకు

**బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు • గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా • ఎగదోయనున్న ఆందోళనకర పరిస్థితులు**




న్యూఢిల్లీ, నవంబర్ 27: అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, ముడి చమురు ధరలు వచ్చే ఏడాది ఆఖరుకల్లా భారీగా పెరుగవచ్చని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ క్రమంలోనే ఔన్స్ పసిడి విలువ 2025 డిసెంబర్ నాటికి ఏకంగా 3,150 డాలర్లను తాకవచ్చని చెప్తున్నది. ఇది ప్రస్తుతంతో పోల్చితే 19 శాతం ఎక్కువ కావడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో ఇప్పుడు ఔన్స్ 2,550 డాలర్ల వద్ద ఉన్నది. అలాగే బ్యారెల్ క్రూడాయిల్ రేటు 100 డాలర్లకు చేరవచ్చని అంటున్నది. ఇప్పుడిది 70 డాలర్ల సమీపంలో కదలాడుతున్నది.

**ఇదీ సంగతి..**

ప్రపంచవ్యాప్తంగా నెలకొనే ప్రతికూల పరిస్థితులు.. ఓవైపు మదుపరులను, మరోవైపు డిమాండ్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సురక్షిత మదుపు సాధనమైన బంగారంతోనే తమ పెట్టుబడులకు రక్షణ అని మెజారిటీ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. అందుకే ద్రవ్యోల్బణం పెరుగుతున్నా, స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నా, యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా, అధికారాలు మారి వ్యాపార-వాణిజ్య పరిస్థితులు దిగజారినా.. వెంటనే పెట్టుబడులను గోల్డ్ వైపునకు మళ్లిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఇలాంటి ఘటనలకు ఎక్కువగానే ఆస్కారముందని, పుత్తడి ధరలు ఆల్‌టైమ్ హైల్లోకి చేరడం ఖాయమన్న అభిప్రాయాలు గట్టిగా వ్యక్తమవుతున్నాయిప్పుడు. ఇక పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు క్రూడాయిల్ ధరల్ని సహజంగానే ఎగదోస్తాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఇబ్బందికర వాతావరణం తప్పక ముడి చమురును ఖరీదెక్కిస్తుందని అంటున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దీనిపై ఐరోపా దేశాల వైఖరి, డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా తీసుకునే నిర్ణయాలు, చైనాతో సుంకాల పోరు ఇలా అనేకాంశాలతో క్రూడ్ సెంచరీ కొడుతుందన్న అంచనాలు పుష్కలంగా వస్తున్నాయి.

**అమెరికానే కేంద్ర బిందువు**

అటు బంగారం కావచ్చు, ఇటు ముడి చమురు కావచ్చు.. ఈ రెండు కమోడిటీ మార్కెట్లను అమితంగా ప్రభావితం చేస్తున్నది అమెరికా ప్రభుత్వ నిర్ణయాలు, ఆ దేశ ఆర్థిక పరిస్థితులే. వచ్చే ఏడాది జనవరిలో అగ్రరాజ్యంలో అధికార మార్పిడి జరుగనున్నది. ట్రంప్ అధ్యక్షుడు కానున్నారు. దీంతో ట్రంప్ దుందుడుకు వైఖరి, ఇప్పటికే బలహీనంగా ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ.. గోల్డ్, క్రూడ్ రేట్లను అమాంతం పెంచేస్తాయన్న అంచనాల్ని గోల్డ్‌మన్ సాచ్స్ వేస్తున్నది. ద్రవ్యోల్బణం భయాలు, ఆర్థిక ఇబ్బందులు గోల్డ్ ఈటీఎఫ్‌లకు డిమాండ్‌ను పెంచుతాయని, ముఖ్యంగా అమెరికా రుణ భారం.. అమెరికాసహా అన్ని దేశాల సెంట్రల్ బ్యాంకులను బంగారం కొనుగోళ్లకు ఉసిగొల్పవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఇక ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు.. బాండ్, స్టాక్ మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేస్తాయన్నది తెలిసిందే. దీంతో విదేశీ మదుపరుల పెట్టుబడుల తీరు కూడా ఇక్కడ ప్రధానం కానున్నది.

### పెరిగిన బంగారం ధర

వరుసగా రెండు రోజులు భారీగా పతనమైన బంగారం ధరలు బుధవారం కోలుకున్నాయి. హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ రేటు రూ.270 పెరిగి రూ.77,510గా ఉన్నది. సోమ, మంగళవారాల్లో రూ.24,00 పడిపోయిన విషయం తెలిసిందే. 22 క్యారెట్ రూ.250 అందుకుని రూ.71,050 వద్ద నిలిచింది. ఇక ఢిల్లీలో 10 గ్రాములు 24 క్యారెట్ పుత్తడి విలువ రూ.650 పుంజుకొని రూ.78,800 పలికింది. కాగా, వెండి ధరల విషయానికొస్తే.. ఈ ఒక్కరోజే కిలో రూ.5,200 ఎగబాకి రూ.95,800లకు చేరింది. అంతర్జాతీయంగా అనుకూల పరిస్థితులు, స్థానిక జ్యుయెల్లర్స్ నుంచి పెరిగిన డిమాండే కారణం.

**ధరల పెరుగుదలకు కారణాలు**

- విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం
- స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు
- పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు
- సెంట్రల్ బ్యాంకుల నుంచి బంగారానికి అధిక డిమాండ్
- అమెరికాలో ఆర్థిక అస్థిరతలు
- పరస్పర సుంకాలు-వాణిజ్య యుద్ధాలు
- ఆయా దేశాల జీడీపీ అంచనాలు

# ఎలక్ట్రిక్ యాక్టివా వచ్చేసింది..

## సింగిల్ చార్జింగ్‌తో 102 కిలోమీటర్లు • జనవరి 1 నుంచి బుకింగ్ స్టార్ట్




బెంగళూరు, నవంబర్ 27: ఎట్టకేలకు యాక్టివా ఈ-స్కూటర్ మార్కెట్లోకి అందుబాటులోకి రాబోతున్నది. దేశవ్యాప్తంగా ఈ-స్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని హోండా మోటర్‌సైకిల్ గతంలోనే యాక్టివాను ఈ-స్కూటర్ రూపంలో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి ఈ-స్కూటర్ కోసం బుకింగ్‌లు ఆరంభించనున్న సంస్థ..ఫిబ్రవరి నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి బెంగళూరు వేదికగా రెండు రకాలుగా ఈ-స్కూటర్లను ప్రదర్శించింది. యాక్టివా ఈ, క్యూసీ1 పేర్లతో వీటిని విడుదల చేసింది. ధర వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఎండీ, సీఈవో త్సుత్సుము ఓటాని మాట్లాడుతూ..ఎలక్ట్రిక్ విభాగంలో ఇదొక మైలురాయి వంటిదని, దేశీయ బెస్ట్ ఈవీ ఏకోసిస్టమ్‌ను తయారు చేయడానికి చాలా సమయం పట్టిందన్నారు.

**ఈ-యాక్టివా ప్రత్యేకతలు**

- 1.5 కిలోవాట్ కెపాసిటీ కలిగిన రెండు బ్యాటరీలు ఇవ్వనున్నది
- సింగిల్ చార్జింగ్‌తో 102 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- 80 శాతం బ్యాటరీ చార్జింగ్ కావడానికి 4.30 గంటలు, 6.50 గంటల్లో పూర్తిస్థాయిలో చార్జింగ్ కానున్నది.
- గంటకు 50 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్‌లో ఎల్‌ఈడీ లైటింగ్, 7.0 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్, రోడ్‌సైన్ డ్యూయో యాప్‌తో కనెక్ట్ చేసుకోవచ్చును.

# ఒత్తిడిలో పౌల్ట్రీ పరిశ్రమ




- కేంద్రప్రభుత్వం చేయూతనివ్వాలి
- పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ డిమాండ్

మాదాపూర్, నవంబర్ 27: దేశ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధికి కీలకంగా ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉన్నదని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 16వ ఎడిషన్‌ను ఐపీఈఎంఎతో కలిసి నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ఈ ఎగ్జిబిషన్ బుధవారం మొదలైంది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయ్ సింగ్ మాట్లాడుతూ.. ఏటా దేశ జీడీపీకి రూ.1.35 లక్షల కోట్ల సహకారాన్ని పౌల్ట్రీ ఇండస్ట్రీ అందిస్తున్నదన్నారు. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్నీ కల్పిస్తున్నదని, అలాంటి ఈ పరిశ్రమ.. ముడిసరుకు వ్యయాలు పెరగడం వల్ల కుదేలవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, సోయా వంటి దాణా ఉత్పత్తులతోపాటు పౌల్ట్రీ ఇండస్ట్రీ పరికరాలపై జీఎస్టీ భారం పెరిగిపోయిందని, దీన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రుణ లభ్యతనూ పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారందాకా కొనసాగనున్న ఈ ఎక్స్‌పోకు 40 వేలకుపైగా సందర్శకులు వస్తారని అంచనా.



# తెలంగాణతో దోస్తీకి బల్గేరియా ఆసక్తి

హైదరాబాద్, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): తెలంగాణతో వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పేందుకు బల్గేరియా ఆసక్తితో ఉన్నదని భారత్‌లో ఆ దేశ రాయబారి డా.నికోలాయ్ యాంకోవ్ వెల్లడించారు. బుధవారం ఆయన సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించి ఒక కామన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను మంత్రి అంగీకరించారు. నూతన ఆవిష్కరణలు, ఫార్మా, లైఫ్‌సైన్సెస్‌లో తమ రాష్ట్రంలో అద్భుతమైన ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని శ్రీధర్ బాబు ఆయనకు వివరించారు. త్వరలో ఇరు దేశాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపాలని శ్రీధర్ బాబు చేసిన ప్రతిపాదనకు యాంకోవ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆ దేశపు గౌరవ కాన్సులేట్, సుచిర్ ఇండియా ఇన్‌ఫ్రా సీఈవో డా.కిరణ్ కుమార్ హాజరయ్యారు.

# మళ్లీ 80 వేలపైకి సెన్సెక్స్

## 230 పాయింట్లు పెరిగిన సూచీ



ముంబై, నవంబర్ 27: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల్లోకి వచ్చాయి. గత కొన్నిరోజులుగా భారీగా నష్టపోయిన అదానీ గ్రూపు షేర్లు తిరిగి లాభాల్లోకి రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 230.02 పాయింట్లు అందుకొని తిరిగి 80 వేల పైకి 80,234.08కు చేరుకున్నది. మరో సూచీ నిఫ్టీ సైతం 80.40 పాయింట్లు అందుకొని 24,274.90 వద్ద నిలిచింది. 24,354 గరిష్ఠ స్థాయి నుంచి 24,145 కనిష్ఠ స్థాయిలో కదలాడిన నిఫ్టీ చివరకు 80 పాయింట్లకు పైగా లాభపడింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఊగిసలాటలో కదలాడిన సూచీలకు ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు జోష్ పెంచాయి. ఫలితంగా భారీ లాభాలవైపు కదంతొక్కాయి. కొన్ని బ్లూచిప్ సంస్థలు నష్టాల్లోకి జారుకోవడం వల్ల భారీ లాభాలు నిలుపుకోలేకపోయాయి.

**కోలుకున్న అదానీ గ్రూపు షేర్లు**

అమెరికా విదేశీ అవినీతి పద్దతుల చట్టం ప్రకారం గౌతమ్ అదానీపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశాలు లేవని అదానీ గ్రూపు స్పష్టంచేయడంతో ఈ గ్రూపు షేర్లు భారీగా పుంజుకున్నాయి. బుధవారం అదానీ టోటల్ గ్యాస్, అదానీ పవర్ షేర్లు అత్యధికంగా 20 శాతం వరకు లాభపడ్డాయి. వీటితోపాటు అదానీ ఎంటర్‌ప్రైజెస్ 11.56 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం, ఎన్‌డీటీవీ 9.35 శాతం, అదానీ విల్మార్ 8.46 శాతం, అదానీ పోర్ట్స్ 6.29 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 4.73 శాతం, అంబుజా సిమెంట్ 4.40 శాతం, ఏసీసీ 4.16 శాతం లాభపడ్డాయి. దీంతో అదానీ గ్రూపు సూచీల ర్యాలీతో మొత్తం మార్కెట్ విలువ రూ.1,24,693.19 కోట్లు పెరిగింది. వీటిలో అదానీ పవర్, అదానీ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.

- ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, మారుతి షేర్లు లాభపడ్డాయి.
- టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూస్టీల్, హెచ్‌యూఎల్, బజాజ్‌ఫైనాన్స్, నెస్లె, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, టాటాస్టీల్, ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టైటాన్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఐసీఐసీఐ షేర్లు నష్టపోయాయి.

# టెల్కోల అప్పు 4 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 27: దేశీయ టెలికం సంస్థలు రుణాలతో సతమతమవుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి నాలుగు టెలికం సంస్థల అప్పు రూ.4,09,905 కోట్లుగా ఉన్నట్లు పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వొడాఫోన్ ఐడియా అత్యధికంగా రూ.2.07 లక్షల కోట్లు రుణం ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ రూ.1.25 లక్షల కోట్లు, జియోకు రూ.52,740 కోట్లు, బీఎస్ఎన్ఎల్ అప్పు రూ.28,092 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. 2021-22లో బీఎస్ఎన్ఎల్‌కు రూ.40,400 కోట్ల రుణం ఉంది.

## ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



*తెలంగాణ ఉద్యమ కళాకారుల పాదయాత్రకు కాజీపేట నుంచి బయల్దేరుతున్న కళాకారులు*

కాజీపేట, నవంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్ వెన్నమల్ల వెంకటేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో బుధవారం ప్రారంభమైన కళాకారుల మహా పాదయాత్రకు కాజీపేట నుంచి భారీగా తరలివెళ్లారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, కళాకారుల అధ్యక్షుడు ఎల్ల పోశెట్టి పిలుపు మేరకు కరీనగర్ అమరవీరుల స్తూపం నుంచి వేములవాడ వరకు 27, 28 తేదీల్లో పాదయాత్ర చేపట్టామని తెలిపారు. తరలి వెళ్లిన పాలాటి రమేశ్, అంకుస్, రాజు, బిర్రు సురేందర్, పాలాటి రాజు, గబ్బెట కృష్ణ ఉన్నారు.

## మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం




*పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు*

పరకాల, నవంబర్ 27 : మత్తు పదార్థాలకు బానిసలు అయితే జీవితాలు నాశనం అవుతాయని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించే పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులు గంజాయి, గుట్కా, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎస్సై శివకృష్ణ, ఎక్సైజ్ ఎస్సై సులోచన, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సుష్మ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సర్దార్, యాంటీ డ్రగ్స్ కమిటీ మెంబర్ పద్మ పాల్గొన్నారు.

**యువత సన్మార్గంలో నడవాలి : ఏసీపీ**

దామెర : యువత గంజాయి, గుట్కా, మద్యానికి దూరంగా ఉండాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని పులుకూర్తిలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో ఎస్సై కొంక అశోక్, మాజీ ఉపసర్పంచ్ మెంతుల రాజు, మారపల్లి జాన్సన్, డేవిడ్, గోవిందు ఆనంద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

**అదనపు డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు**



*విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు*

వరంగల్, నవంబర్ 27 : విద్యార్థులు ఆరోగ్యమైన ఆహారం తీసుకోవాలని అదనపు డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 162 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి రోహిత్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ప్రధానోపాధ్యాయుడు వేదాంత చారి, హెల్త్ అసిస్టెంట్ ఇంద్రారెడ్డి, మోసిన్, సీవో కిరణ్మయి, ఏఎన్ఎంలు సరిత, ఆశ, ప్రమీల పాల్గొన్నారు.

## గురుకులంలో ట్రెడిషనల్ డే



*వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు*

మడికొండ, నవంబర్ 27 : మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ట్రెడిషనల్ డే వేడుకలు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ అధికారి సత్య, మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ హాజరై సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉగాది, బతుకమ్మ, దీపావళి, సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్, తీజ్, గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

# కుడా మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం

- అమల్లోకి విజన్-2041
- 1,805 చదరపు కిలోమీటర్లకు గ్రేటర్ వరంగల్ పరిధి
- గ్రోత్ కారిడార్‌కు అధిక ప్రాధాన్యం



*2041 విజన్‌తో రూపొందించిన మాస్టర్ ప్లాన్ మ్యాప్*

వరంగల్, నవంబర్ 27 : విజన్ 2041తో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ రూపొందించిన మాస్టర్‌ప్లాన్ అమలులోకి వచ్చింది. ఈనెల 19న నగర పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్‌కు ఆమోదముద్ర వేసినట్లు ప్రకటించారు. 2041 నాటికి నగర విస్తరణ, పెరిగే జనాభా అంచనాలకు తగ్గట్లుగా మాస్టర్ ప్లాన్‌ను తీర్చిదిద్దారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటతోపాటు 181 గ్రామాలను కలిపి 1,805 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ప్రాంతాన్ని ఇందులో చేర్చారు. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, గ్రోత్ కారిడార్(మిక్స్‌డ్ జోన్), పబ్లిక్, సెమీపబ్లిక్ , రవాణా (రహదారులు) రిక్రియేషన్ (పార్కులు) జోన్లుగా విభజించారు.

**గ్రోత్ కారిడార్‌కు అధిక ప్రాధాన్యం**

1805 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కుడా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో 43శాతం ప్రాంతం గ్రోత్ కారిడార్‌కే కేటాయించారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా కమర్షియల్, తర్వాత రెసిడెన్షియల్ జోన్లుగా విభజించారు. అర్బన్ ప్రాంతంలో 20శాతం, రూరల్ ప్రాంతం లో 10శాతం రెసిడెన్షియల్ జోన్‌గా చూపారు. 8 శాతం కమర్షియల్, 2శాతం ఇండస్ట్రియల్, 11 శాతం రహదారులకు కేటాయించారు. మిగిలిన 6శాతం వ్యవసాయం, రిక్రియేషన్, సెమీ పబ్లిక్, గుట్టలు, వాటర్‌బాడీలుగా మాస్టర్ ప్లాన్‌లో చూపించారు.

**అనుమతులు కొత్త మాస్టర్ ప్లాన్‌తోనే..**

మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించి, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటి నుంచి భవన నిర్మాణాల అనుమతులు కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం మంజూరు చేయనున్నారు. మాస్టర్ ప్లాన్‌లో విభజించిన జోన్ల వారీగానే అనుమతులు ఇవ్వనున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నారు. త్రినగరితో పాటు 181 గ్రామాల పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలు జరుగనుంది. అయితే కొంతకాలంగా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను అధికారులు అనధికారికంగా అమలు చేశారు.

## రైతులకు మరిన్ని నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తాం

హనుమకొండ సబర్బన్, నవంబర్ 27 : రైతులకు మరిన్ని నాణ్యమైన ఉత్పత్తులు అందించేందుకు ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ కృషి చేస్తుందని కంపెనీ ప్రతినిధి రాజారెడ్డి తెలిపారు. బుధవారం ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కంపెనీ ప్రతినిధులు హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం, సహృదయ అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, పున్నంచందర్, ప్రసాద్, తిరుపతి, నాగరాజు, మహేందర్ పాల్గొన్నారు.

*అన్నదానం చేస్తున్న ఏరిస్ కంపెనీ ప్రతినిధులు*





*ఉత్సవాలను ప్రారంభిస్తున్న సూర్యనారాయణమూర్తి*

## పోతన జయంతి ఉత్సవాలు ప్రారంభం

పోచమ్మమైదాన్, నవంబర్ 27: వరంగల్‌లోని ఏవీవీ విద్యా సంస్థలో పోతన జయంతి ఉత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏవీవీ సంఘ సభ్యుడు ఎస్ఎస్‌వీఎన్ శర్మ మాట్లాడుతూ తాను చిన్నతనంలో ఈ ప్రాంగణంలోనే పోతన పద్యాలను చదువుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మావుడూరు సూర్యనారాయణమూర్తి పోతన భక్తితత్వాన్ని వివరిస్తూ, బాల్యక్రీడల నలకూబర సుగ్రీవుల వృత్తాంతాన్ని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి మాట్లాడుతూ యావత్ భారతావనిలో నిర్వహించని పోతన జయంతిని సంస్థ వ్యవస్థాపకుడు ఆచార్య చందా కాంతయ్య శ్రేష్ఠి 70 ఏళ్ల క్రితమే ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన భాగవత పద్యపఠన పోటీల్లో రెండు వేల మంది విద్యార్థులు పాల్గొనగా, ఉత్తమ పద్యపఠనం చేసిన వందమందికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సౌజన్య, గందె శ్రీనివాస్, సంజీవ, ఏవీవీ సంఘ యాజమాన్యం, విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థికసాయం

న్యూశాయంపేట, నవంబర్ 27 : హనుమకొండ హంటర్ రోడ్డులోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హాస్టల్ యజమాని రవీందర్ కుమారుడి కిడ్నీలకు ఇన్ఫెక్షన్ సోకింది. కాగా, హాస్పిటల్ ఖర్చుల కోసం నగరంలోని ప్రైవేట్ హాస్టల్ సభ్యుల తరపున బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, పొలిటికల్ వైబ్స్ టీవీ సీఈవో పుప్పాల రజినీకాంత్ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థికసాయం చేశామని ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏరుకొండ పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పంచగిరి రతన్‌కుమార్, గొర్రె కృష్ణ, కురిమిళ్ల శ్రీనివాస్, కూడికంద్ల భాస్కర్, మధుసూదన్‌రాజ్, మనోహర్, బోయిన చంద్రమౌళి, చిరంజీవి, మోడం కవిత, రోజా, లక్ష్మీయాదవ్, దివ్యాపటేల్ పాల్గొన్నారు.



*నగదు అందజేస్తున్న సంఘ బాధ్యులు*

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ



*పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ, నాయకులు*

శాయంపేట నవంబర్ 27 : బీఆర్ఎస్ పెద్దకోడపాక గ్రామ అధ్యక్షుడు కోగిల తిరుపతి తల్లి ఎల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఎల్లమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మారపల్లి మోహన్, గోవిందాపూర్ గ్రామ అధ్యక్షుడు దాసి శ్రావణ్‌కుమార్, శాయంపేట అధ్యక్షుడు గాజె రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, నాయకులు కిష్టయ్య, కరణ్ బాబు, అశోక్, రమేశ్ ఉన్నారు.

## మార్నేనికి జన్మదిన శుభాకాంక్షలు



*జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రవీందర్‌గౌడ్*

ఆత్మకూరు, నవంబర్ 27 : టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు జన్మదిన సందర్భంగా బుధవారం ఆయనను స్వగ్రామంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బోయగాని సంపత్‌కుమార్, లస్కర్ చందర్ ఉన్నారు.

## జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు లక్ష్మణాచారి



*లక్ష్మణాచారిని సన్మానిస్తున్న హెచ్ఎం, కోచ్ పార్థసారథి*

హసన్‌పర్తి, నవంబర్ 27 : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చెంగల్లి లక్ష్మణాచారి జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. విద్యార్థిని కోచ్ పార్థసారథి, అధ్యాపకులు సత్కరించారు. సెయింట్ మేరీస్ పాఠశాల పదో తరగతి విద్యార్థి జన్ను నిశాంత్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాడు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

*హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్*

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 27 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్ అన్నారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి గంగవరపు వెంకట భానుప్రసాద్ హాజరయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు అంతడుపుల నాగరాజు బృంద ప్రదర్శన ఆకట్టుకుంది. చక్రాల రఘు, బృందం తమ ప్రదర్శనలతో అలరించారు.

